


నేడు జిల్లాకు మంత్రి సత్యప్రసాద్ రాక

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈనెల 28, 29 తేదీల్లో తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న సోమవారం మధ్యాహ్నం 1.05 గంటకు మంత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారని, అనంతరం తిరుపతి పట్టణంలో స్థానిక కార్యక్రమాలలో పాల్గొని రాత్రి బస చేయనున్నారని, 29 ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని, అనంతరం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.





చెత్త సంచులు మోసుకు వెళ్తున్న చిన్నారులు



భారెడు కష్టంలోనూ చిట్టితల్లి చిరునవ్వు

చిట్టి చేతులు.. చెత్త సంచులు..

బడి సంచులు మోయాల్సిన చిన్నారులు ఇలా..

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): పాఠశాలకు పుస్తకాలను మోసుకెళ్లి చదువుకోవాల్సిన వయసు... తోటి విద్యార్థులతో కలిసి ఆటలాడుకుంటూ సంతోషంగా గడపాల్సిన వయస్సు.. పేదరికం మూలాన పైన కనిపిస్తున్న ఈ చిన్నారులు పుస్తకాలు మోయాల్సిన వయసులో రోడ్లపై ప్లాస్టిక్, ఇతరాత్రా వస్తువులను ఏరుకుంటూ పొట్ట పోసుకుంటూ జీవనం గడపాల్సిన పరిస్థితి. ఆదివారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ ప్రధాన మార్గం వద్ద ఈ చిన్నారులు ఇలా చెత్త సంచులను మోసుకెళ్తూ కనిపించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించాలని గళమెత్తే మహానుభావులు ఇటువంటి పిల్లలను గుర్తించి చదువు వైపు అడుగులు వేయించ గలిగితే భావిభారత పౌరులుగా ఎదిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లా యంత్రాంగం స్పందించి ఇటువంటి చిన్నారులకు భవిష్యత్తును ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

టైమింగ్స్ మార్చిన రైల్వే

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడుస్తున్న కొన్ని ప్రధానమైన రైళ్ల సమయాలను మారుస్తూ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇలా మార్చిన సమయాల ప్రకారమే ఈ రైళ్లు ప్రస్తుతం నడుస్తున్నాయి. టైమింగ్స్ మార్చిన వాటిల్లో నారాయణాద్రి, పద్మావతి, నాగర్‌సోల్ రైళ్లు ఉన్నాయి. ఏయే టైమింగ్స్ ప్రకారం నడుస్తున్నాయో వాటి వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపల్లి నుంచి తిరుపతి మధ్య నడుస్తున్న నారాయణాద్రి 12734 ప్రతిరోజు సాయంత్రం 5.30 గంటలకు లింగంపల్లిలో బయలుదేరి 6.05 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి తెల్లవారుజామున 5.55 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. గుంటూరుకు రాత్రి 10.55 గంటలకు చేరుకుంటుంది. మార్గమధ్యంలో బేగంపేట, సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గుడూరు, వెంకటగిరి, శ్రీకళాహస్తి, రేణిగుంట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. హైదరాబాద్ నుంచి తిరుపతి మధ్య నడుస్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ 12764 టైమింగ్స్‌లో కూడా స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. గూడూరు వరకు ఎటువంటి సమయం మార్చలేదు. గూడూరుకు ఉదయం 4.19 గంటలకు, రేణిగుంటకు 5.58 గంటలకు, తిరుపతికి 6.55 గంటలకు చేరుకుంటుంది. హైదరాబాద్‌లో సాయంత్రం 6.30 గంటలకు పద్మావతి బయలుదేరుతుంది.

31న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

ప్రజాశక్తి- తిరుమల

ఈనెల 31వ తేదీన తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం సందర్భంగా స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఇందుకు సంబంధించి 30వ తేదీ బుధవారం తిరుమలలో సిఫార్సు లేఖలు స్వీకరించబడవని టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

నవంబరు నెలలో పర్వదినాల వివరాలు

1న కేదారగౌరీ వ్రతం, 3న భగినీహస్త భోజనం, శ్రీ తిరుమలనంబి శాత్తుమొర, 5న నాగుల చవితి, పెద్ద శేష వాహనం, 6న శ్రీమనవాళ మహామునుల శాత్తుమొర, 8న వార్షిక పుష్పయాగానికి అంకురార్పణ, 9న శ్రీవారి పుష్పయాగం, అత్రి మహర్షి వర్ష తిరునక్షత్రం, పిళ్లైలోకాచార్య వర్ష తిరు నక్షత్రం, పోయిగైయాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, పూదత్తాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, వేదాంత దేశికుల శాత్తుమొర, 10న పేయాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 11న శ్రీ యాజ్ఞవల్క్య జయంతి, 12న ప్రబోధన ఏకాదశి, 13న కైశిక ద్వాదశి ఆస్థానం, చాతుర్మాస్య వ్రత సమాప్తి, 15న కార్తీక పౌర్ణమి, 28న ధన్వంతరి జయంతి, 29న మాస శివరాత్రి.

యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- పాడిరైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి
- సిపిఎం 14వ జిల్లా మహాసభ తీర్మానం
- రెండోసారి జిల్లా కార్యదర్శిగా వాడ గంగరాజు



జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు హైదర్‌వలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సిపిఎం 14వ జిల్లా మహాసభ జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఉత్సహభరిత వాతావరణంలో జరిగింది. మొదటిరోజు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రెండో రోజైన ఆదివారం స్థానిక కట్టమంచి రోడ్డులోని శాంతా రఘురామ్ కళ్యాణ మండపంలో సిపిఎం జెండాను పార్టీ సీనియర్ నాయకులు హైదర్‌వలి ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులు స్థూపానికి రాష్ట్రనాయకులు రమాదేవి, దడాల సుబ్బారావు, జిల్లా నాయకత్వం నివాళి అర్పించింది. జిల్లా నాయకులు సురేంద్రన్, షకీల అధ్యక్షతన సమావేశం కొనసాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు సిపిఎం సిద్ధం కావాలని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి పిలుపునిచ్చారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడారు. కేంద్రలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు నాయడు ప్రభుత్వం పేద, బడుగు బహీనవర్గాల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను గెలిచిన తరువాత పట్టించుకోవడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరల అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం అన్ని వర్గాలకు ప్రజలను కలుపుకొని పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గత మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో నిర్వహించిన ప్రజాసమస్యలపై పోరాటాలను సమీక్షించి రానున్న మూడేళ్లలో ప్రజాసమస్యలపై భవిష్యత్తు పోరాటలకు రూపకల్పన చేశారు.

సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, నాయకులు ఓబుల్‌రాజు, సురేంద్రన్, గిరిధర్‌గుప్తా, భువనేశ్వరి, సృజనిలతో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



రెండోసారి జిల్లా కార్యదర్శిగా వాడ గంగరాజు

14వ జిల్లా మహాసభల్లో రెండోసారి జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు జిల్లా కార్యదర్శిగా ఎన్నికైయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా సురేంద్రన్, ఓబుల్‌రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, షకీలను ఎన్నుకున్నారు.

జిల్లా మహాసభ తీర్మానాలు

- జిల్లా కేంద్రంలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలి.
- పాడి రైతుకు గిట్టుబాటుధర కల్పించాలి.
- స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలి, కనీస వేతనాలు అమలు చేయాలి.
- భూకబ్జాలు అరికట్టాలి.
- మహిళలు, చిన్నపిల్లలపై అత్యాచారలు, దాడులు అరికట్టాలి.
- దళితులపై దాడులు అరికట్టాలి.
- ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలి.
- హంద్రీ-నీవా కాలువ పెండింగ్ పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలి.
- అడవిపల్లి రిజ్వారాయర్ పనులు పూర్తి చేసి చిత్తూరుకు తాగునీరు అందించాలి.
- జానపద కళాకారులకు కాణిపాకం దేవస్థానంలో కళాప్రదర్శనలకు అవకాశం కల్పించాలి.
- మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.
- పవర్‌లూమ్ కార్మికులకు తమిళనాడు తరహాలో 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి.


హే..బిడ్డా.. ఇది మా అడ్డా..

మందు చుక్క.. చికెన్ ముక్క.. ఎంచక్కా..

- రెచ్చిపోతున్న మందుబాబులు
- వెంచర్లు, ఖాళీ స్థలాలు, పార్కుల్లో తిష్ట
- రాత్రింబవళ్లు తేడాలేకుండా తాగేస్తున్న వైనం
- మద్యం మత్తులో చిందులు, గొడవలు
- ఇబ్బందిపడుతున్న వాకర్స్, స్థానికులు



మనులాలపేట రోడ్డులో ఉన్న వెంచర్లు ఖాళీ మద్యం బాటిళ్లు



ప్రజాశక్తి- డక్కిలి : మద్యం షాపులు ప్రైవేట్ వారికి అప్పగించడంతో మద్యం ఏరులైపారుతోంది.. అమ్మకాలకు సైతం సమయపాలన లేకుండా షాపు యజమానులు ఉదయం నుంచే మొదలు పెడుతున్నారు. దీంతో మద్యం ప్రియులు ప్రతి రోజు పండగే అన్నట్లుగా ఎంజాయ్ చేస్తున్నారు.. పగలు రాత్రి అన్న తేడా లేకుండా నిత్యం మద్యం మత్తులో చిందులు, గొడవలతో స్థానికులను ఇబ్బందిలకు గురిచేస్తున్నారు. వెంచర్లు, ఖాళీగా వున్న స్థలాలు, పార్కులు వీరికి అడ్డాగా మారుతున్నాయి. అటుగా వెళ్లాలంటే మహిళలు, బాలికలు, వృద్ధులు అలాగే వాకర్స్ భయపడాల్సిన పరిస్థితి.

డక్కిలి మండలం వెంకటగిరి పట్టణ శివారు ప్రాంతాల్లోని వెంచర్లు, చుట్టుపక్కల కాలనీల్లో ఉన్న స్థలాలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ఇక పార్కులైతే అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. అంతేకాకుండా అక్కడే మద్యం తాగి చెత్తాచెదారం వేయడంతోపాటు బాటిళ్లను పగలగొట్టి పడేస్తున్నారు. దీంతో అటుగా వస్తున్న పాదచారులు చాలా మంది గాజుపెంకులు గుచ్చుకొని ఇబ్బంది పడిన సంఘటనలు ఉన్నాయి. చీకటిపడితే చాలు వెంకటగిరి – పెంచలకోన జాతీయ రహదారిపై మందుబాబులు బైకులు, కార్లలో మద్యం, మాంసం, కూల్‌డ్రింక్స్‌తో వచ్చి వాలిపోతున్నారు. ఇక బృందాలు బృందాలుగా గంటల తరబడి సిట్టింగులు వేస్తుంటారు. అర్ధరాత్రి వరకు జాతీయ రహదారిపై వారి చిందులు హంగామాతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా మనులాలపేట రోడ్డు, నగరంలోని కుమరిగుంట కాలనీలోని పార్కు వద్ద ఎక్కువగా మందు బాబులు హంగామా చేస్తున్నారు. సమీపంలో ఉన్న కాలనీల ప్రజలు రాత్రి వేళల్లో మందుబాబుల ఆగడాల వలన బయటకు రావాలంటేనే భయపడాల్సిన దుస్థితి నెలకొంది. పోలీసులు రాత్రి సమయాల్లో పట్టణంలో గస్తీలు తిరుగుతున్నా శివారు ప్రాంతాలపై ఎక్కువ దృష్టి పెట్టడం లేదు. ఇకనైనా మందుబాబులు ఎక్కువగా ఉంటున్న ప్రాంతాల్లో గస్తీ పెంచాలి. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రుపతి జిల్లా పరిధిలో రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించకుండా దురుసు డ్రైవింగ్ చేసే వారిపై నూతన వాహన చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకుంటున్నామని జిల్లా రవాణాశాఖ అధికారి మురళీ మోహన్ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా పరిధిలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నూతన వాహన చట్టం అమలు, వాహన్‌పోర్టల్ పనితీరు తదితర అంశాలపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రజాశక్తి: విద్యాసంస్థల బస్సులలో సినిమా పాటలను ప్లే చేస్తే తీసుకునే చర్యలు ఏవి?

రవాణాశాఖ అధికారి: జిల్లా పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు చెందిన బస్సులలో సినిమాలకు చెందిన పాటలను వినిపిస్తున్నారని సమచారం అందింది. విద్యా సంస్థలకు చెందిన బస్సులలో ప్రయాణించే విద్యార్థుల దృష్టిని మార్చే ప్రమాదం ఉన్నందున ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ఎవరైతే చట్టాన్ని మీరి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారో గుర్తించి అపరాద రుసుంతో పాటుగా వాహనాన్ని స్వాధీనం చేసుకుంటాం.

ప్రజాశక్తి: అధిక ఛార్జిలను వసూళ్లు చేసే వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

రవాణాశాఖ అధికారి: సాధారణంగా పర్వదినాలు, పండుగ రోజులలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన వాహనాలపై తనిఖీలను నిర్వహస్తాం. ఇటీవల విజయదశమి పండుగ సందర్భంగా జిల్లా పరిధిలో 86 బస్సులపై కేసులు నమోదు చేశాం. వీటిలో అధిక ఛార్జీలు వసూళ్లు చేయడం, అనధికారికంగా వస్తురవాణా చేస్తున్న బస్సులు, నేషనల్ పర్మిట్ కాలపరిమితి పూర్తి అయిన వాహనాలకు జరిమానాలు విధించాం. రానున్న సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకోని తిరుపతి జిల్లా నుండి బయట ప్రాంతాలకు వెళ్లే వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబోతున్నాం.

ప్రజాశక్తి: రోడ్డు ప్రమాదాల ఘణాంకాలు ఎలా ఉన్నాయి..

రవాణాశాఖ అధికారి: గతంతో పోల్చుకుంటే రోడ్డు భద్రతా నియమాలను పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు సంఖ్య పెరుగుతోంది. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటుంన్నాం. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాలను ఏర్పాటు చేసి వివిధ శాఖల అధికారులతో కలిసి సమన్వయ నిర్ణయాలను తీసుకొని అమలు చేస్తున్నాం. 2021లో 1003, 2022లో 1019, 2023లో 1029, 2024 సెప్టెంబర్ నెలాఖరు వరకు 819గా రోడ్డు ప్రమాదాలు నమోదు అయ్యాయి. ముఖ్యంగా ఈ రోడ్డు ప్రమాదాల్లో యువతే ఎక్కువ భాగం మృత్యువాత పడ్డారు.

ప్రజాశక్తి: అపరాధ రుసుము వివరాలు తెలుపండి..

రవాణాశాఖ అధికారి: త్రైమాసిక పన్నులను చెల్లించని వాహనాలు జిల్లా పరిధిలో అత్యధికంగా ఉన్నాయని గుర్తించాం. వీరి నుంచి జరిమానాల వసూళ్ల కోసం డ్రైవ్ నిర్వహస్తున్నాం. అక్టోబర్ 1వ తేది నుండి 25 వరకు 1105 వాహనాలకు అపరాద రుసుము విధించాం. దీని ద్వారా రాష్ట్ర ఖజానాకు కోటి మూడు లక్షల రూపాయల ఆదాయం చేకూరింది. త్రైమాసిక పన్నులను ఎవరైతే చెల్లించకుండా ఉన్నారో వారు వాహన తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం అపరాదరుసుం కట్టాల్సి వస్తుంది. సకాలంలో త్రైమాసిక పన్నులను చెల్లించి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఉత్సాహంగా చెకుముకి సంబరాలు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరాలు ఆదివారం స్థానిక రీజనల్ సైన్స్ సెంటర్లో ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల స్థాయిలో విజేతలైన 60 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, 300 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. చెకుముకి జిల్లాస్థాయి పరీక్ష నిర్వహించిన అనంతరం సైన్సు సెంటర్ సందర్శన, ప్లానిటోరియం, సైన్స్ మేజిక్ షోలను ఉత్సాహంగా తిలకించారు. భోజనం అనంతరం జరిగిన సభలో అతిథులు విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు సైన్స్ పుస్తకాలు బహుకరించారు. ఈ సభలో జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని ప్రశంసించారు. రీజినల్ సైన్స్ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ మాట్లాడుతూ విద్యార్థులు దేశాభివృద్ధికి శాస్త్రీయ ఆలోచనలు పెంచే ఇటువంటి కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ఫలాలు అందరికీ దక్కాలని, మూఢ నమ్మకాలను వ్యతిరేకించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు 2 మణికంఠ, ఫిజికల్ సైన్స్ ఫోరం మేఘనాథ్, రోటరీ క్లబ్ రవికుమార్, తిరుపతి బాలోత్సవం దామోదరం, జెవివి నాయకులు చెంగయ్య, రఫీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. విజేతలైన ఈ స్కూళ్ల విద్యార్థులు నవంబర్ 9, 10 తేదీలలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తారకరామ స్టేడియంలో నిర్వహించిన కార్తీక్ మ్యూజిక్ కాన్సర్టుకి వెళ్లిన యూనివర్సిటీ విద్యార్థులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఈస్ట్ పోలీస్ స్టేషన్ డిఎస్పి వెంకట నారాయణకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవిలు మాట్లాడుతూ శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో యూనివర్సిటీ విద్యార్థులైన నరేంద్ర, వీరేష్‌లు గ్రౌండులో ఉండగా అక్కడ వున్న నలుగురు స్పెషల్ పార్టీ పోలీసులు వచ్చి ఇక్కడ కూర్చొకూడదని చెప్పడంతో అక్కడ నుంచి వెళ్ళిపోతుండగా వెనక నుంచి వచ్చి మెడపట్టుకొని తోసారని, అప్పుడు వీళ్లిద్దరు ఎందుకు సార్ కొడుతున్నారు, మేము వర్సిటీ విద్యార్థులమేగా అని చెప్పడంతో రవిబాబు నాయక్ అనే కానిస్టేబుల్ దుర్భాషలు ఆడుతూ యూనివర్సిటీ విద్యార్థులు అయితే ఏమైనా పీకుతారా, అక్కడ ఉన్న యూనియన్ నాయకులు అంతా నాకు తెలుసు, ఎస్పీ కూడా నన్ను ఏమి చెయ్యలేడంటూ క్యాంపస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని, మళ్ళీ అక్కడ ఆరు మంది పోలీసులు కలిసి వారిని చితకబాది మొబైల్స్ లాక్కుని స్టేషన్ బయటకు తరిమివేశారని తెలిపారు. అక్కడ వున్న మిగతా విద్యార్థులు ఎస్ఎఫ్ఐ నాయకులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన నాయకులు అక్కడకి చేరుకొని సీఐ రామయ్యతో మాట్లాడి మొబైల్స్ ఇప్పించారని, ఆ రాత్రి ముప్పైమంది విద్యార్థులతో క్యాంపస్ స్టేషనుకి వెళ్లి కానిస్టేబుల్స్ పైన చర్యలు తీసుకోవాలని కోరగా సీఐ రామయ్య స్పందిస్తూ విద్యార్థులను నేరుగా డీఎస్పీ దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడినట్లు తెలిపారు. డీఎస్పీ వెంకట నారాయణ మాట్లాడుతూ ఈ విషయం ఎస్పీతో మాట్లాడి వాళ్ళమీద కఠిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులపై అకారణంగా దాడి చేసిన వారిని సస్పెండ్ చెయ్యకపోతే యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. సోమవారం ఈ విషయాన్నీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జిల్లా నాయకులు అశోక్, తేజ, శ్రీనివాస్, వినోద్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటాం : సిపిఎం

తిరుపతి టౌన్: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తారకరామా స్టేడియంలో కార్తీక్ లైవ్ మ్యూజిక్ కాన్సెట్‌కు హాజరైన ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులపై అకారణంగా దాడి చేసిన కానిస్టేబుల్ రవినాయక్ ఇతర ముగ్గురు కానిస్టేబుల్స్‌ను సస్పెండ్ చేయాలని సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నది.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కోట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతి ఎస్వీ అరవింద నేత్రాలయం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 180మందికి డాక్టర్లు కంటి పరీక్షలు చేశారు. 60మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ, 20మందికి ఆపరేషన్‌లు చేస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు గౌరిశంకర్, సీతారామ్ నాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణ, నేత్రాలయ సిబ్బంది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఓం శ్రీ సత్యసాయి స్పిరిచ్చువల్ అండ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీ సత్యసాయి సేవా సమితి, కుమ్మరి వీధిలోని ప్రేమ సుధ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు వెంకటసుబ్బయ్య, తిరుపాలయ్య, సురేష్ బాబు, ఆనంద్ బాబు, మల్లికార్జున, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గంధ మహోత్సవానికి విచ్చేయండి'



ఆహ్వానం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అజ్మతే ఇలాహి పంచతన్ మౌలాక పహాడ్ పుత్తూరు ఎన్టీఆర్ కాలనీ గుట్టలో ఉన్న దర్గాలో గంధం మహోత్సవానికి విచ్చేయాలని ముస్లిం మైనారిటీ నాయకులు పలువురికి ఆహ్వానం పలికారు. టీడీపీ నాయకులు జీవరత్నం నాయుడు, గణేష్, షణ్ముఖ రెడ్డి, బాబు నాయుడు, మహమ్మద్ నబికి ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు హెస్సేన్, రఫీ అహమ్మద్, మత పెద్దలు మహమ్మద్, గౌస్, శబ్దర్, చాను, హమీద్ బాషాలు ఉన్నారు.

నేడు పుత్తూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సీడప్, డిఆర్‌డిఏ సంయుక్తంగా స్థానిక హిమజ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ సురేంద్ర రాజు, ప్రిన్సిపాల్ లోకనాథంలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐదు బహుళ జాతీయ సంస్థల వారు పాల్గొని అభ్యర్థులు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో పది, ఇంటర్, డిగ్రీ పాస్, పెయిల్, ఐటిఐ చదివిన 18 నుంచి 32ఏళ్ళ వయస్సు గల స్త్రీ, పురుషులు అర్హులు అన్నారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 6300954441, 9963561755 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.


'పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బందులు'



సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి -కోట: పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారని గూడూరు డివిజన్ యువ వైసీపీ నేత చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన కోటలో విలేకరులతో మాట్లాడుతూ ఏ వస్తువు టచ్ చేసిన భగ్గుమంటున్న ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత పది రోజులుగా పెరుగుతున్న ధరలతో మార్కెట్ ధరల బోర్డులో రేట్లు సాధారణం కంటే రెట్టింపునకు చేరుకున్నాయన్నారు. వంట నూనెల ధరలు ఒక్కసారిగా వినియోగదారులను కుదుపునకు గురిచేశాయని తెలిపారు. అదేవిధంగా దీపావళి పండుగకు ముందు వంట నూనెల ధరలు అమాంతం పెరిగాయని అన్నారు. గత నెలలో 100రూపాయలుగా ఉన్న లీటర్ పామాయిల్ ధర 137కి చేరగా, సోయాబీన్ 120 నుంచి 148, సన్ఫవర్ 120 నుంచి 149, ఆవ నూనె 140 నుంచి 181, వేరుశనగ నూనె 180 నుంచి 184 మేర పెరిగాయని అన్నారు. ఇలాగే రేట్లు కొనసాగితే సామాన్య ప్రజలు అల్లాడిపోతారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

చంద్రబాబు కుట్రలో పావుగా మారిన షర్మిల: భూమన



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: చంద్రబాబు చేసిన కుట్రలో పిసిసి అధ్యక్షులు షర్మిల పావుగా మారారని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతిలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్ లాంటి నాయకుడు రాజకీయాల్లో చాలా అరుదు, ఇచ్చిన మాటకు వెనుకంజ వేయకుండా సర్వం త్యాగం చేయడానికి సిద్ధపడ్డ వ్యక్తి జగన్, 2009లో సోనియాకు లొంగి వుంటే ఇప్పుడు పరిస్థితులు మరోలా ఉండేదని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఎటువంటి చిన్న తప్పు చేయలేదన్నారు. షర్మిల తప్పు చేసి జగన్ సరస్వతి షేర్స్‌ని అమ్మపేరు మీద గిఫ్ట్‌గా రాస్తే తల్లి అమాయకత్వాన్ని వాడుకొని జగన్ బెయిల్‌ను రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు కుట్రలో షర్మిల భాగస్వాములయ్యారన్నారు.

కమ్మేసిన కంపచెట్లు

- రహదారి పొడవునా ఇదే పరిస్థితి
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



చెట్లు పొదల చాటున సూచిక బోర్డులు



మైక్రో టవర్ కాలనీ వద్ద

ప్రజాశక్తి-కోట: ఆర్అండ్‌బి రహదారిలో పిచ్చిచెట్లు, ముళ్లకంపలు దట్టంగా పెరిగిపోయి ప్రజలు రాకపోకలు సాగించేందుకు అడ్డంకిగా మారాయి. రోడ్డుపైకి చెట్ల కొమ్మలు వ్యాపించడంతో రోడ్డు మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రజలు క్షతగాత్రులుగా మారుతున్నారు. చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వ్యాపించడంతో వాహనదారులకు దారి కనిపించక ఇటు వాహనదారులు, అటు ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.

- కోట మండలంలో ప్రధానంగా విద్యానగర్ నుంచి కోట క్రాస్ రోడ్డు వరకు ఆర్అండ్‌బి రోడ్డు ఇరు ప్రక్కల సమస్య మరింత తీవ్రంగా ఉంది. అయితే ఆర్అండ్‌బి రహదారిలో అనేక ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలను కోల్పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.
- గత వారం రోజుల్లోనే ఊనుగుంటపాలెం, మైక్రోటవర్ కాలనీ, రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద, బాలభారతి స్కూల్ వద్ద, కోట క్రాస్ రోడ్డు, విద్యానగర్ బాంబ్ బ్లాస్ట్ ప్రాంతం వద్ద, చిట్టేడు సమీపంలో, విద్యానగర్ నుంచి నెల్లూరు కొత్తపాలెం గ్రామానికి వెళ్లే వంతెన వద్ద హెచ్చరిక బోర్డులు లేనందున రహదారిలో ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందారు. పలువురుకి తీవ్ర గాయాలైన సందర్భాలు మరెన్నో ఉన్నాయి.
- గత 20రోజుల క్రితం నెల్లూరుపల్లి కొత్తపాలెంకు వెళ్లే ఓ వంతెన వద్ద ఓ మలుపు ఉందని వాహనదారుడు గుర్తించక యూటర్న్ హెచ్చరిక బోర్డు లేనందున కాలువులో పడిపోయింది. అదేవిదంగా కార్లు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై వస్తున్న ప్రయాణికులు ఎదురుగా వస్తున్న వాహనాన్ని గుర్తించక ప్రమాదానికి గురై మృత్యువాత పడుతున్నారు. ఆర్అండ్‌బి రోడ్డు ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఉండి కూడా ఉపయోగం లేకుండా పోతుందని ప్రయాణికులు వాపోతున్నారు. అదేవిదంగా మలుపు వద్ద ఏపుగా పెరిగిన ముళ్ళ పొదలను గుర్తించకపోవటంతో రాత్రి సమయాల్లో మరింత ఇబ్బందికరంగా ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- విద్యానగర్‌లో ఉన్న బాలభారతి స్కూల్ వద్ద మధ్యలో డివైడర్ నిర్మించారు. కానీ ప్రయాణికులుకు మధ్యలో హెచ్చరిక బోర్డులు లేక డివైడర్ కనిపించక ఇటీవలన మూడు కార్లు, రెండు లారీలు నేరుగా డివైడర్ మీదుగా వెళ్లి ప్రమాదాలు జరిగాయి. ఎత్తుగా, ఏపుగా పెరిగిన చెట్లు యూటర్న్‌ల ప్రమాదాలకు కారణం అవుతుంటే.. అక్కడ యూటర్న్ ఉందని, వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా వెళ్లాలని బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం వాహనదారులకు ప్రాణసంకటంగా మారుతోంది. అంతేకాకుండా చెట్లు ఏపుగా పెరగడంతో ఆర్అండ్‌బి రోడ్డుపై ఉన్న విద్యుత్ ట్రాఫిక్ లైట్లు కూడా కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.
- కోట పట్టణం నుంచి కోట బైపాస్ రోడ్డు వరకు ఆర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపుల చెట్లు తీవ్రంగా పెరిగిపోవడంతో హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్జిన్‌లు కనపడకపోవడంతో ప్రయాణికులు నానారకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి గ్రామంకు వెళ్లే మొదట గ్రామ ఊరు పేరుతో బోర్డులు, అదేవిదంగా హెచ్చరిక బోర్డులు ఉండి కూడా కనపడడం లేదు.
- కోట మండల పరిధిలో ఆర్అండ్‌బి రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయని అనేక మార్లు అధికారులకు స్థానికులు మొరపెట్టుకున్నా కూడా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో నిత్యం భారీ వాహనాలు డివైడర్‌ల పైకి దూసుకుపోతూ ఓ వైపు ప్రాణాలతో చెలగాటం, మరోవైపు స్థానికులు భయభ్రాంతులకు గురవ్వక తప్పడం లేదు.

పలు ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనాలు వేగంగా వెళుతున్న సమయంలో కొంతమంది యూటర్న్ తీసుకుంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిదంగా ఆర్అండ్‌బి రోడ్డుకి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లను తొలిగించి ప్రమాదాలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. పలు చోట్ల కోట బజారు, కోట క్రాస్ రోడ్డు, విద్యానగర్ సెంటర్, చిట్టేడు, శ్రీనివాస స్కూల్, బాలభారతి స్కూల్, తదితర చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే వాహనాలు అతివేగంగా పోకుండా ఉండడానికి అవకాశాలు ఉంటాయని ప్రజలు కోరుతున్నారు.

వాహనదారుల ప్రాణాలు కాపాడాలి



రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరగడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక ప్రయాణం చేయాలంటే భయానకరంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేసేలా చర్యలు తీసుకుంటే వాహనదారుల ప్రాణాలను కాపాడిన వారవుతారు.

- కనుపూరు మురళీకృష్ణ, విద్యానగర్ గ్రామం, వ్యాపారవేత్త

త్వరలో జంగిల్ క్లియరెన్స్ పనులు

త్వరలో కోట, వాకాడు, చిట్టమూరు మండల పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని నివేదికనుపై ఉన్నత స్థాయి అధికారులకు మూడు రోజుల ముందు ప్రపోజల్ పంపాం. త్వరలోనే పనులు ప్రారంభించి ప్రమాదాలు జరగకుండా కట్టడి చేస్తాం. గత మూడు రోజులు నుంచి ఆర్అండ్‌బి ఈఈతో కలిసి ఆ మండలాల్లో ఉన్న జంగిల్ క్లియరెన్స్ ఎక్కడెక్కడ ఉందో క్షుణ్ణంగా పరిశీలించి వచ్చాం.

- ఆర్అండ్‌బి డిఈ చంద్రశేఖర్ రెడ్డి

యూటీఎఫ్ తొట్టంబేడు మండల కమిటీ ఎన్నిక





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యుటిఎఫ్ తొట్టంబేడు మండల కమిటీ ఎంపిక ఆదివారం జరిగింది. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా తొట్టంబేడు మండల శాఖ మహాసభ జరిగింది. అధ్యక్షులుగా వి.సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.రవికుమార్, గౌరవాధ్యక్షులుగా సుబ్రమణ్యం, కోశాధికారిగా ఢిల్లీబాబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి కే ముత్యాల రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల హాజరయ్యారు. వచ్చే ఏడాది జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. స్వర్ణోత్సవ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా కార్యదర్శులు దండు రామచంద్రయ్య, మోహన్ బాబు, వెంకటకృష్ణ, దీపిక, హేమాంబరధరరావు, శ్రీనివాసులు, సూర్య ప్రకాష్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్ డ్రైవర్లకు రక్షణ కల్పించండి: సిఐటియు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఎలక్ట్రికల్ బస్ డ్రైవర్లకు రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. స్థానిక అలిపిరి డిపో వద్ద ఆదివారం సిఐటియు సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి తిరుమల మధ్య ఏపీఎస్ ఆర్టీసీ ఎలక్ట్రికల్ హెయిర్ బస్సులు 50 నడుస్తున్నాయని వాటిని నడిపే డ్రైవర్లకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. తరచూ ఇతర వాహనదారుల చేత దాడులకు గురవుతున్నారని, రాత్రివేళల్లో మద్యం తాగి బస్సులకు అడ్డుపడుతున్నారని, ప్రశ్నించిన డ్రైవర్లను బస్సులోని యాత్రికులపై కూడా దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈనెల 25 తేదీ రాత్రి 10 గంటల ప్రాంతంలో తిరుమల నుండి తిరుపతి రైల్వే స్టేషన్‌కు వచ్చేటప్పుడు పలుమార్లు బస్సుకు అడ్డుగా ఓ ద్విచక్ర వాహనం అడ్డుపడుతూ వచ్చిందని, ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్ సమీపంలో బైక్‌ను బస్సుకు అడ్డంపెట్టి మరీ బస్సు లోపలికి వెళ్లి డ్రైవర్‌పై దాడి చేశారని తెలిపారు. దాడిలో డ్రైవర్ షఫీబాషకు తీవ్రగాయాలై దవడ ఎముకలు నరాలు దెబ్బతిన్నాయని తెలిపారు. బస్సులో ఉన్న యాత్రికులు వారిని ఎదుర్కొని, వారిని తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో అప్పచెప్పారని తెలిపారు. అందులో ఒకరు పారిపోగా మరో వ్యక్తి తాగి ఉన్నాడని అతన్ని కూడా పోలీసులు విడిచిపెట్టారని తెలిపారు. డ్రైవర్ షఫీబాషను రుయా ఆసుపత్రిలో చికిత్స అందించి కేసు నమోదు చేసినా పోలీసులు నిందితులను ఇప్పటివరకు పట్టుకోపోవడం సరైనది కాదని, డ్రైవర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముని రాజా, ఎలక్ట్రికల్ బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.

వాకర్స్‌తో ఎమ్మెల్యే



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి కపిలతీర్థం, అలిపిరి రోడ్డులోని దివ్యారామంలో ఆదివారం వాకర్స్‌తో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మమేకమై స్థానికంగా ఉన్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. తిరుపతిలోని 15 వాకర్స్ పార్కులలో ఒక్కొక్కరోజు ఒక పార్క్ చొప్పున వాకర్స్‌తో మమేకమై నియోజకవర్గ సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, గురునాధం, కృష్ణకాంత్, వాసు పాల్గొన్నారు.

104 సిబ్బంది జీవితాల్లో దీపావళి నింపండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అంగేరి పుల్లయ్య

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి 104 సిబ్బంది జీవితాల్లో దీపావళి నింపాలని సీఐటీయూ అనుబంధ 104 యూని యన్ జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్, ప్రధాన కార్యదర్శి బత్తిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. దీపావళి అంటే అందరి జీవితాల్లో వెలుగులు వస్తాయనీ, మా జీవితాల్లో అంధకారం నెలకొనే పరిస్థితి ఉందని వాపోయారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం 104 తిరుపతి జిల్లా యూనియన్ సమావేశం జరిగింది. గత మూడు నెలలుగా పెండింగ్లో ఉన్న జీతాలు అందక అప్పులు చేసి కుటుంబాలు పోషించుకుంటున్నామని అన్నారు. 2005 నుంచి పనిచేస్తున్న ఉద్యోగస్తులను రెగ్యులర్ చేయాలనీ, 2020 నుంచి పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి భువనేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీమోహన్, సిఐటియు నాయకులు పుల్లయ్య, గురవయ్య, వెంకటేష్, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.


క్రైం కార్నర్

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం



ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): తిరుపతి - చంద్రగిరి రైల్వేస్టేషన్ మధ్య ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు కనుగొన్నారు. రైల్వే ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి సుమారు 8గంటల ప్రాంతంలో కెఎం నం.98/1-3 పోస్టులు, తిరుపతి - చంద్రగిరి రైల్వేస్టేషన్ మధ్య ఒక గుర్తుతెలియని వ్యక్తి వయస్సు సుమారు 45-50సం..లు వుండి ఆత్మహత్య చేసుకునిగాని, లేదా రైలు ప్రమాదం వలన గాని చనిపోయి వున్నట్లు తెలిపారు. మృతునివద్ద అతని ఆచూకీ తెలిపే ఎలాంటి ఆధారాలు లభించలేదని మృతుడు బ్లూ కలర్ ఫుల్ షర్ట్, లోపల వివిధ రకాల బనియన్లు, రెండు రకాల షార్టులు ధరించి చూడడానికి సంచారి/దేశదిమ్మరి లాగా వున్నట్లు ఆర్పీ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. చిత్తూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440416642, 9494228854 నంబర్లకు తెలియజేసి దర్యాప్తునకు సహకరించాలని కోరారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అక్టోబరు 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పవిత్రోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో మొదటిరోజైన సోమవారం ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు పవిత్రప్రతిష్ఠ నిర్వహించనున్నారు. రెండో రోజున మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ చేస్తారు. చివరిరోజు 30న రాత్రి 7గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ పవిత్రోత్సవాలలో వేదపఠనం, ఆలయశుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలి'



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న హేమావతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సాటి మనిషికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించిన తమపై నోటికొచ్చినట్లు దుర్భాషలాడిన ఆర్టీసి సూపర్వైజర్ కాకి కృష్ణయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వడమాలపేట మండలం ఎస్వీపురానికి చెందిన దళిత మహిళలు హేమావతి డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో ఆమె మాట్లాడారు. కొద్ది రోజులకు మునుపు ఓ సమస్యపై ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు వెళితే అక్కడ కాకి కృష్ణయ్య వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ రైతు తమ వద్దకు వచ్చి ఆయన పడుతున్న బాధను వివరించాడన్నారు. దీంతో కాకి కృష్ణయ్యను ప్రశ్నించిన దానికి ఆయన మహిళలు అని చూడకుండా దుర్భాషలాడుతూ ఓ డ్రైవర్ భార్య అని, నీ భర్తను ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరించాడని వాపోయారు. ఇతనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఉన్నతాదికారులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉమాదేవి, మణెమ్మ, మంజుల, నాగేశ్వరీ, ముని వెంకటరమణ పాల్గొన్నారు.

'టీడీపీ సభ్యత్వంతో ప్రతి కుటుంబానికి భరోసా'



సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న నాయకులు



శ్రీకాళహస్తిలో

ప్రజాశక్తి-రామచంద్రాపురం: సభ్యత్వంతో టీడీపీ ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు మేకల తిరుమలరెడ్డి అన్నారు. ఆదివారం ఆర్సీ పురం పార్టీ కార్యాలయంలో సభ్యత నమోదు కార్యక్రమంపై డివిజనల్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో సమావేశం నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం వారికి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకొనేలా చూడాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు జనార్ధన్ చౌదరి, బిందు మాధవి, హరి ప్రసాద్, నరసింహారెడ్డి, రామిరెడ్డి, వెంకట ప్రసాద్, కోటేశ్వర్ రెడ్డి, జెడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం తొట్టంబేడు పంచాయితీలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ పార్టీ మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు మాట్లాడుతూ రూ.100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొందడం ద్వారా ప్రమాద బీమా ఐదు లక్షలు పొందచ్చని సూచించారు. అదేవిధంగా సీఎం రిలీఫ్ ఫండ్ త్వరితగతిన పొందే అవకాశం ఉంటుందనీ, కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పార్లపల్లి పంచాయతీలో ఆదివారం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఆదిశేషయ్య ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీటీసీ మనోహర్ నాయుడు, నాయకులు రమణయ్య యాదవ్, సత్యనారాయణ, మునేయ్య, రమేష్, ధనంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ

ఆర్‌సీ పురం పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

ప్రజాశక్తి-రామచంద్రాపురం: ఉచిత ఇసుకను అక్రమంగా వాహనాలలో తరలిస్తే కఠిన చర్యలు తప్పవని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం ఇసుక అక్రమ రవాణాలను అరికట్టేందుకు రాయలచెరువు కట్టపై చెక్ పోస్ట్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. స్వర్ణముఖి నది నుంచి ఇసుకను ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా టిప్పర్లు లారీలతో ఇతర రాష్ట్రాలకు జిల్లాలకు తరలించరాదన్నారు. అనంతరం ఆర్‌సి పురం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్లో సిబ్బంది కొరతపై విలేకరులు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ రామాంజనేయులు, ఏఎస్ఐ శేఖర్, హెడ్ కానిస్టేబుల్ యోబు, సురేష్, సుధాకర్ రెడ్డి, రమేష్, త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు అరికట్టడానికి ప్రగతి సంస్థ ముందడుగు'




అవగాహన కల్పిస్తున్న ప్రగతి సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలంలోని ఎర్రంరెడ్డి పల్లెలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన 9వ తరగతి చదువుతున్న 14సంవత్సరాల బాలికకు అదే గ్రామానికి చెందిన 31సంవత్సరాల అబ్బాయికి బాల్య వివాహం జరిపించారు. గ్రామంలోని ఏఎన్ఎం, మహిళా పోలీస్ సమాచారంతో ప్రగతి సంస్థ ఎంసిఓ ప్రభాకర చొరవతో సిబ్బంది ఎర్రంమరెడ్డి పల్లెలోని బాలిక నివాసం వద్దకు చేరుకుని బాలికకు కౌన్సిలింగ్ ఇచ్చారు. శ్రీకాళహస్తి పోలీస్‌స్టేషన్లో అబ్బాయి పైన కేసు నమోదు చేయడానికి వారి కుటుంబ సభ్యులను స్టేషన్‌కి తరలించారు. పోలీస్‌స్టేషన్లో గ్రామ పెద్దలు, నాయకుల సమక్షంలో అబ్బాయికి, అమ్మాయి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి మళ్లీ ఇలాంటి చట్ట విరుద్ధమైన వివాహం చేసుకుంటే కఠినమైన చర్యలు ఉంటాయని అబ్బాయి కుటుంబ సభ్యులను మందలించారు. గ్రామం చుట్టుపక్కల బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, బాలికకు 18సంవత్సరాలు పూర్తయ్యే వరకు ఎటువంటి హాని జరగకుండా ఉంటుందని గ్రామ పెద్దలు బాధ్యత తీసుకుంటున్నట్లు అందరి సమక్షంలో లిఖితపూర్వకంగా గ్రామ పెద్దల నుంచి హామీ పత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా బాలిక చదువు మధ్యలో ఆగిపోకూడదని ఉద్దేశంతో ప్రగతి సంస్థ వ్యక్తిగత చొరవ తీసుకుని బాలికను దగ్గరలో ఉన్న రెసిడెన్షియల్ స్కూల్లో జాయిన్ చేయడం జరిగిందని ప్రజా ప్రగతి సంస్థ ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్స్ రాజారెడ్డి, నారాయణ, ఎంసిఓస్ ప్రభాకర, జయలక్ష్మి, శిరీష, సుభాష్, చంద్రబోస్, కౌన్సిలర్స్ రామయ్య, మధు కుమార్, వెంకటరత్నం పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఘనంగా ఆయుధపూజ

విద్యుత్ యంత్రాల వాహనాలకు పూజలు



ఆయుధ పూజ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో ఆదివారం ఘనంగా ఆయుధపూజ నిర్వహించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది విద్యుత్ యంత్రాల వాహనాలకు పూజలు చేశారు. ఇందులో భాగంగా సబ్ డివిజన్ రూరల్ కార్యాలయంలో, అర్బన్ కార్యాలయ ఆవరణలో వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో వేధికలను అలకరించి, దుర్గాదేవి అమ్మవారి చిత్రపటాలను ఏర్పాటు చేశారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, యంత్ర పరికరాలకు, వాహనాలకు ఆయుధపూజలు చేశారు. ఆయుధపూజ నేపథ్యంలో అతిథులకు ఆల్పాహార విందును ఏర్పాటు చేశారు. నాయకులు సుబ్రమణ్యం నాయుడు, కుమార్, రాజారెడ్డి, బాల, గౌష్ బాషా, చంద్రశేఖర్ రెడ్డి, తులసిరెడ్డి, ఉమాపతిరెడ్డి, మోహన్ రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, ఈఈ వాసురెడ్డి, ఏడిఈ శేషాద్రి రెడ్డి, ఏఈ నాగరాజ, ఏఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF X ADDITIONAL DISTRICT JUDGE :: TIRUPATI
I.A.NO.206 OF 2022, O.S.NO.32 OF 2021
S. Giri Babu ...Petitioner/Defendant No.3
Vs.
S. Raghavendra Prasad and others .... Respondents
Substituted service of notice to the Respondent No. 2, 5 to 7
To
2. Sreepuram Venkata Krishnaiah son of Late S. Narayanaswamy, residing at Door No.6-7-630/C, Sripuram colony, K.T.Road, Tirupati, Chittoor district
5.S.Dhananjayulu Naidu son of S. Narayana swamy, residing at Door No.306, Mitta street, Tirupati.
6. S.Deenadayal son of S. Narayanaswamy, residing at Door No.6-7-630/E, Sripuram colony, K.T. Road, Tirupati.
7. S.Saisathish Kumar son of Venkata Krishnaiah, residing at Door No.6- 7-630/C, Sripuram colony, K.T.Road, Tirupati.
Sir/Madam,
Please take notice that the above Petition by the petitioner/defendant no.3 and the same stands posted to 04.11.2024 for your notice at 10.30 a.m., before the above court, and if you fail to appear in person or through pleader the matter will be decided exparte.
/by order of court/
Sd/-A. Madhavi
Advocates for Petitioner/Defendant No.3

IN THE COURT OF X ADDITIONAL DISTRICT JUDGE: TIRUPATI
I.A.NO.207 OF 2022, O.S.NO. 32 OF 2021
S.Giri Babu ...Petitioner/Defendant No.3
Vs
S.Raghavendra Prasad and others ...Respondents
Substituted service of notice to the Respondent No. 2, 4 to 7
To
2. Sreepuram Venkata Krishnaiah son of Late S. Narayanaswamy, residing at Door No.6-7-630 / C, Sripuram colony, K.T.Road, Tirupati, Chittoor district
4. N. Vijayalakshmi wife of N.Bhaskarand daughter of Late S.Haribabu, residing at Door No.18-5-1A2, Sapthagiri Nagar, K.T.Road, Tirupati
5. S. Dhananjayulu Naidu son of S. Narayana swamy, residing at Door No.306, Mitta street, Tirupati.
6. S. Deenadayal son of S.Narayanaswamy, residing at Door No.6-7-630/E, Sripuram colony, K.T. Road, Tirupati.
7. S.Saisathish Kumar son of Venkata Krishnaiah, residing at Door No.6- 7-630/C, Sripuram colony, K.T.Road, Tirupati.
Sir/Madam,
Please take notice that the above Petition by the petitioner/defendant no.3 and the same stands posted to 04.11.2024 for your notice at 10.30 a.m., before the above court, and if you fail to appear in person or through pleader the matter will be decided exparte.
/by order of court/
Sd/-A.Madhavi
Advocates for Petitioner/Defendant No.3